# కమల

శ్రీమతి పెరిచెఱ్ఱ మాణిక్యాంబగారు

"ఏమి కమలం! ఈరోజు మాధవరావు తన గృహమునకు మనలను 'టీ'కి రమ్మన్నందున వెళ్లదలచితిమి గదా! ఇంకా నీవు తయారు కానటులనుపడుచున్నావే. వారింటి కెప్పుడు వెళ్లుట? అక్కడనుండి సినీమా కెప్పుడు వెళ్లుట? చదువుకొనుచున్న దానవగు నీవే ఇట్లుండిన ఇంక నితరులసంగతులడుగ నెందులకు?" అని నాగేశ్వరరావు తన సహాధ్యాయినిని తొందరపెట్టుచుండెను. ఆమెయు కాలానుసరణంబుగ నలంకరించుకొని, చరచర వీధిలోనికి తన మిత్రునితో వచ్చి, అక్కడనున్న పనిమనిషితో "ఓసీ వెంకీ! నే నీరోజున బహుశా ఆలస్యముగా యింటికివచ్చెదనని అమ్మగారితో చెప్పివేయుము" అని పల్కి అతనితో వెడలిపోయెను. ఆమె తల్లియు పనిమనిషివల్ల తానువినిన సంగతికి విసుగుకొనుచు "అయ్యో! ఇదియేమి కాలమహిమ, అంతకంతకు ఈ విద్య జ్ఞానార్జనమునకు గాక, విహారమునకే సహాయకారియగుచున్నది. ఎవరి ననుకొన్న నేమి లాభము. కుటుంబమును సరియైనరీతిని, సరియైన పద్ధతులపైన, నడుపవలసిన గృహయజమానులే ఇట్టి అసందర్భపు వాతావరణములోబడి కొట్టుకొనిపోవుచున్నారు." అని సణుగుకొనుచుండగా వీధిగుండు కారుచప్పుడాయెను. కుటుంబరావుగారు, చేతిలో మందులపెట్టెను పట్టుకొని కంపౌండరు వెంట వచ్చుచుండ లోనికి వచ్చి ఈజీఛైరులో నైన కూర్చొన వీలులేనందున స్టూలుమీద కూర్చొని, తన దుస్తులను మార్చుకొనుచూ, కంపౌండరునకు ఏవియో కొన్ని కాగితములనిచ్చి పంపివేసెను. భార్య రుక్మిణమ్మ చేతి కందిచ్చిన జలముతో ముఖ, పాద, ప్రక్షాళనముల గావించుకొని భుజింప లోనికేగి నలువైపుల కలయజూచి "మన కమల భుజించినదా?" అని ప్రశ్నించెను. "ఏ గంటలు కొట్టకమునుపే స్నేహితురాలితోనే కలసి బయటకు వెళ్లినదట. ఇంటికివచ్చునరికి ఆలస్యమగునట." అని జవాబిచ్చెను. "ఆఁ హాఁ! అయిన సరి, నీవుకూడ భోజనముచేయుము. అనవసర ఆలస్యమెందులకు?" అని భుజించుచూ "టు". అని అంటివే, అమ్మాయి వెళ్లినసంగతి నీకు వేరుగా తెలియదా" అని అడిగెను.

రుక్మి:—తెల్పుటకు తగినటుల మీరు ఉంచినచో గదా యుండుట. ఎవరిచ్ఛవారిది. ఎవరిమనస్సు వారిది అనే సిద్ధాంతంలో చెందిన మిమ్ములను, మీకుమార్తెను అడుగువారెవరు? ఎనిమిది గంటలు కావచ్చినది. ఈడుకవచ్చిన కన్య, నవయౌవనుడగు వేరొకయువకునితో నిశ్శంకగా షికారులా!! అడిగిన వారిని అనాగరికులు, నమ్మకము, విశ్వాసము లేనివారలు అని మీరుమిక్కిలి నిందించుటకు ప్రారంభింతురు. దీనికంతటికీ, మీ అవిచారపూర్వకమైన ప్రవర్తనయే కారణము" అని కోపయుక్తమైన స్వరముతో బల్కెను.

కుటుంబ:—నీ విట్టి అనవసర అనుమానములను పెట్టుకొని సహజమగు వ్యక్తి స్వాతంత్ర్యమును అరికట్ట జూచుచున్నావు. రేపు నేనూ, కొంచము ఆలస్యముగా వచ్చిన, ఇట్టి అనుమానములనే పెట్టుకొనెదవు కాబోలును? సరి, సరి.

రుక్మిణి:—నాగరిక చిహ్నమని తలపబడు ఇట్టి స్వేచ్ఛా వ్యామోహములో మునిగిన మీకు నే చెల్పు వాక్యములు ఇప్పట్లో చెవికెక్కజాలవు. మానవజీవితమునందు స్త్రీజాతి స్వభావమైన స్వాతంత్ర్యమును పవిత్రపదమును, చాపల్యసూచకమై అహంకార మద



364

కారములచేతను, కామక్రోధ ఇత్యాది ప్రకృతిగుణములచేతను ఆవరింపబడినట్టి క్షేత్రముయొక్క స్వభావముగు ఇచ్ఛకు సంబంధించిన స్వేచ్ఛను ముడిపెట్టి నిజమైన స్వాతంత్ర్యమును అనుభవించుచున్నామను వెఱ్ఱి లోబడి ముందువెనుక లరయక శూలమంది కొట్టుకొని పోవుచున్నారు.

కుటుంబ:—రుక్మిణీ! ఏ మంత వెఱ్ఱిదానవు. మిన్నొచ్చి మీదపడినంత విచారమును పొందుచున్నావే!! వారు తమసరదాలను ఇప్పుడు తీర్చుకొనకున్న మరెప్పుడు తీర్చుకొనెదరు?

రుక్మిణి:—మీ జవాబు మరీ బాగున్నది. వక్రమార్గములకు ఎట్టివారికైన నీడ్చుకొనిపోవు నవకాశమిచ్చు యౌవనకాలమున మనమట్టి పరిస్థితులకు దోహదమిచ్చుట సమంజసమా! జీవితి యౌవనకాలము త్రాసుముల్లువంటిది. మంచి, చెడుగులను రెండువైపుల తక్కెళ్లకు ఎటువాటము హెచ్చుగానుండిన ఆ ముల్లు అటులొరుగక తప్పదు. అందులో పురుషుని దేహ, మనో నైసర్గికములకన్న స్త్రీల నైసర్గికములు స్వభావముగ భిన్నములు.

ఇట్లు వీరు మాటాడుకొనుచుండగా 25 సంవత్సరముల నవయువకుడు, సర్వాంగసుందరుడు, అచ్చటికి ప్రత్యక్షమై "ఏమి మామా! అత్తా! క్షేమమా?" అని పల్కరించెను. ఆ దంపతులును ఆశ్చర్యానందములతో "ఏమి నాయనా ఆనందం! ఎప్పుడు ఎమెరికానుండి వచ్చితివి? 'మాకొక జాబైన వ్రాయగూడదా? నాన్న, అమ్మ, తమ్ములు, చెల్లెండ్రు, అందరు క్షేమమా?" అని తొందరతొందరగా ప్రశ్న పరంపరలను గురిపించి పూర్తిగా జవాబులనైన గాంక్షించక, స్నానమునకు లెమ్మని తొందరించి భోజనమునకు వలయు ఏర్పాట్లను జేయుచుండిరి. ఆనందరావు స్నానమును ముగించి మేనమామ ప్రక్కనే వేయబడిన పీటపై గూర్చుండి "అత్తా! కమల అప్పుడే నిద్రపోవుచున్నదా ఏమి? ఆకస్మిక సమావేశమునం దుత్పన్నమగు సహజానంద మనుభవింపవలెనను కాంక్షతో మీకు జాబునైన వ్రాయక నేరుగావచ్చితిని" ఆ పలుకులు విని రుక్మిణమ్మయు ఏమియు జవాబును చెప్పజాలక "ఈ రోజు సినిమాకు ఎవ్వరో కొందరు తోడి బాలికలు వెళ్లుచుండ తానుకూడ వెళ్లినది. ఇంకొక గడియకు రాగలదు.

కుటుంబ:—నీవు సౌఖ్యముగా వచ్చినందుకు చాల సంతోషము. ఇక నీవు చేయదలచిన కార్యక్రమ మేమి?

ఆనంద:—మానాన్నగారు నన్ను ఏ ఉద్దేశముతో పంపిరో వానికొరకే పాటుపడి దేశీయవస్తు నిర్మాణమునకు సహాయమును చేయవలెనని యున్నది. నాన్నగారప్పుడే ఏర్పాట్లన్నియు చేసి లక్షరూపాయల పెట్టుబడితో పని నుపక్రమించారు.

కుటుంబ:—(సంతోషముతో) నాయనా! చిరంజీవివై వర్ధిల్లి నీ ఆదర్శమును అచిరకాలముననే పొందువాడ వౌదువుగాక. మరొక్క సంగతి. ఆదేశములో స్త్రీల విషయమై నీ యభిప్రాయ మేమి? గుఱ్ఱు పెట్టినందులకు ముద్దు పెట్టుకొనినందులకు ఇంక నిటువంటి ఇతర సందర్భములలోనే, దాంపత్య విచ్ఛేదములు జరుగుచూ వింతవింతలైన పద్ధతులు అమలులోనికి వచ్చుచున్నట్లు ఇక్కడ పత్రికలమూలమున తెలుసుకొనుచున్నాము. ఇటువంటివి నిజముగా జరుగుచున్నవా? లోకమునకు ఇదిగో పులియన్న అదిగో తోక అని అనుస్వభావముగదా?

ఆనంద:—మనదేశస్త్రులగూర్చి ఎవ్వరైన అన్నప్పుడు అట్టిది రటస్థమగును గాని' ఆ దేశస్థుల విషయమై లేనిది వ్రాసిన వారెంతమాత్రము ఊరుకొనరు సుమా! ఆ దేశమున కుటుంబసౌఖ్యము కుటుంబగౌరవము పరిశీలనగా చూచినచే తప్పు గాంచలేము. మనదేశమున ఏనాడును పెందలగు నీచజాతులనబడు వారియందు గాన్పించు కుటుంబ పరిస్థితులు అక్కడ

365

సర్వసామాన్యముగా నుండును. ఈ సంగతులు మీకు పత్రికల మూలమున బోధపడుచునే యుండి యుండ వచ్చును. ఆ విషయములు మనమంతగా మాట్లాడ తగ్గవి గావు.

రుక్మిణి:—మీ మామగారుకూడ మనసంఘమం తయు అనాదిరీతిగా నుండవలెననియే కదా కాంక్షించు చున్నారు. మాతండ్రిగారు కూడ మమ్ములను స్కూలు ఫైనలు వరకు చదివించిరి కాని మా యుద్దేశములను, మాయాదర్శముల ప్రక్కదోవలకు పోకుండునట్లు బహు జాగ్రత్త తీసికొనినారు. రేపటినుండి నేనుగూడ మా ఫ్రెండ్లఎంగేజిమెంట్సులో ఉండెదను. అని నవ్వుచూ బల్కెను.

కుటుంబ:—(నవ్వుచూ) తానే పెట్టిన మూడే సోలలైనట్లు నీవేనా ఏమి గుత్త. ఎవరో ఒకరు ఈ మాత్రము సదుపాయమునకు దారికరనుకొన్నావు కాబోలును.

రుక్మిణి:—సరి, సరి, ఇందులోనే తెలియుచున్నది. అప్పుడే 'నీతోనేనా' అని అన్నంతవరకు ముదిరించారు. అమ్మాయి కాబోలు తలుపు తట్టుచున్నది.

౨

"నేను గంపెడాశతో అప్పటి మనయుభయుల మధ్య జరిగిన వాగ్దత్తములను దలచి ఈ మన సమావేశము మన ఇరువురకు సమానానందదాయకమగు నను ఆతుర్దాతో విదేశమునుండి వచ్చినవెంటనే మా అమ్మ నాల్గుదినములు విశ్రమించి మరీ వెళ్లుమని బలవంత పరచినను వినక సర్వత్రుకొని వచ్చితిని. నే వచ్చి నేటికి 3 దినములైనది. ఒక్కగంటసేపైనను నాతో మనసిచ్చి మాటలాడుటకు నీ కవకాశము లేకున్నది. ఏమి కమలా! నాతో మాటాడుటకు నీ కయిష్టముగా నున్నదా ఏమి? లేక స్త్రీల సహజాలంకారమగు లజ్జాభూషణమును ధరించితివా?

కమల:—ఇప్పు డవన్నియు ప్రబంధభూషణ ములుగ మాత్రమే యుండుటకు తగియున్నవని నీవెరు గవు కాబోలును! ఇప్పుడు నే జేయవలసిన దేదో స్పష్టముగ జెలుపుము.

ఆనంద:—(మనస్సు చివుక్కుమన) కమలా! నీకు నేను మన చిన్ననాటినుండి మనతోనే మన మన స్సులలో పెరుగుచున్న ఈపరస్పర ప్రేమాంకురముల గూర్చి జ్ఞప్తికిదేవలసి వచ్చెనా? నేను విదేశములం దున్నప్పుడు నీ అప్పటిప్రేమవాక్కులనే తలచి తృప్తి నొందుచు ప్రపంచయాత్ర ఇకముందు నీ సహవా సానందమున సుఖముగ జరుపుకొన ఆశించితిని. అట్టి నన్ను ఈవిధముగ ప్రశ్నించి నొప్పించుట నీకు న్యాయమా?

కమల:—ఆనందం! ఎందుల కీ కంఠశోష. ఇప్పట్లో వివాహమాడి నా స్వేచ్ఛను గోల్పోవ నా కిష్టములేదు. బి. ఏ. ఇంకా పూర్తిగాలేదు. వెనుక నుండి మాటాడుకొనవచ్చును. నామిత్రులు నాకొఱకు వేచియుందురు. కాలాతిక్రమణ మగుచున్నది. పోవలెను.

ఆనంద:—నేనుకూడ నీకొకప్పుడు ప్రాణాధికుడ నని నీ వన్నకాలము గలదని నీవు మరువకుము. నీ కాలమును వృథాచేయుచుంటినని నీ వెంచినప్పటికి, నా నిశ్చితాభిప్రాయమును రెండుమాటలలో జెప్పి ఈ రాత్రియే బయలుదేరి వెడలిపోవుచున్నాను. అప్ప టికి నీవు బహుశా ఇంటికి రావని తలచెదను. కమలా ఏనాడైతే మన ఇరువురిహృదయములు శాశ్వతపవిత్ర ప్రేమసూత్రముచే బంధింపబడి పంచభూతముల సాక్షిగా మనోవాక్కాయ కర్మములచేతను మనము ప్రమాణమొనరించుకొంటిమో, ఆనాటినుండియే ఈ నా హృదయము నీ కర్పణచేసితిని. నేటికి అది కించిత్తైన చలించలేదు. నా జీవితాంతమువరకు ఇటులనే యుండె దను. ఆనాడు నీ పల్కిన పల్కులు సత్యాక్షరము

లతో నా హృదయమున లిఖించుకొంటిని. నీహృదయమును గూడ నావిధమునసే నాకు దత్తముచేసిన కథనము నీకు జ్ఞప్తియం దుండకపోదు. దానివిలువను, దాని పవిత్రతను మరువకుము. ఇదే సెలవు" అని పల్కి ఆనందరావు ఇక తిరిగైన చూడక మేనమామ ఇంటికి వచ్చువరకు ఆగుమని మేనత్త ఎంతబ్రతిమలాడినను వినక, ఆమెవద్ద సెలవుపుచ్చుకొని విశాఖపట్టణమునకు ప్రయాణమయ్యెను. రుక్మిణమ్మ తనసంగతులను ఊహించలేనంత మందమతిగాదు. బహు తెలివైనయువిద! పెనిమిటి గృహమునకు వచ్చినపిమ్మట చూచాయగా ఈ సమాచారమును దెల్పి అల్లునిముఖవైఖరిని గూర్చి కొంతచెప్పెను. కుటుంబరావును కొంతవరకు నిదానముగా యోచించి తనకుమార్తెయొక్క దురుసుతనమును, అల్లుని నిష్కళంక ప్రేమానురాగమును గూర్చి యోచించి స్తబ్ధుడై కొంతవడి యుట్టిమిన్నకుండెను.

సుందరమ్మ 40 సంవత్సరముల ముత్తైదువ. తగిన కుటుంబమున బుట్టి తగిన ఇంటబడి సిరిసంపదలతో తులతూగుచు విద్యావినయ వివేకాదులకు పట్టుగొమ్మరై, అందరిచే పూతచరిత్రయని పూజింపబడునంత గౌరవస్థానమును బడసెను. ఒకరోజు ఉదయము మైలులో సోదరుడగు కుటుంబరావు గృహమునకు నెల్లూరుచేరెను. ఆమెనుగాంచిన వెంటనే ఏదియో యొక అపరాధమును గావించిన అపరాధులవలె కుటుంబరావు దంపతులుగతుక్కుమని, తిరిగి సమాళించుకొని ఆమెను తగువిధమున పూజించి కుశలప్రశ్నలను గావించుచు, "సుందరం! మన ఆనందం ఇచ్చటికి రెండుసంవత్సరములక్రిందట వచ్చినప్పుడు 3 దినములుండి నాతో చెప్పనైన చెప్పక వెడలిపోయినాడు. నాటిమొదలు నేటివరకు వాని దస్తూరితో ఒకజాబైన నాకు వ్రాయలేదు.

సుందరమ్మ:—వానిసంగతిని గూర్చి యోచించుటకే ఇచ్చటికి వచ్చినాను. ఇచ్చటినుండి అచ్చటికి వచ్చినలగాయతు ఒకవిధమైన వింత మార్పు వానియందు స్పష్టముగ గాన్పించుచున్నది. వివాహము చేసుకొమ్మనిన వలదను మార్గపు పట్టేగాని మరివేరమాటయే లేదు. కాని వాని ప్రవర్తనగాంచిన, అట్టి సుపుత్రరత్నము నా గర్భవాసమున గల్గినందుకు నేను మిగుల గర్వించుచున్నాను. ఒక్కొక్కప్పుడు సమస్త లోకమును ఉద్ధరించుటకు తగు ఉదారహృదయము గల సామర్థ్యవంతు డితడేనా అని అనుకొనుచుందును. మేమందరము సకలవిధ సౌఖ్యము లనుభవించుచుండ, తాను ఒంటిగ నిట్టి సంతోషములయందు పాల్గొను అవకాశములు కల్పించుకొనకుండ, శరీరధారణ మాత్రమున కాహారమును సేవించుచు, కాలము బుచ్చుట గని నే సహించలేకున్నాను. నీ కుమార్తెయగు కమలాన్ని మన ఆనందం ప్రేమించినట్లును, ఇరువురు ప్రేమబద్ధులైనట్లును మనము చాలదినముల క్రిందటనే అనుకొంటిమిగదా. ఇంకెందులకు యోచించుచున్నావు?

కుటుంబ:—నేనేమియు చెప్పజాలను. దానిమనస్సునుగూర్చి తెల్పుటకు నా కట్టి స్వాతంత్ర్యము లేదు. దానిని పిలచి నీవే అడుగుము. అని కుమార్తెకొరకు కబురుచేసెను. కమలయు మేనత్తను చూడగానే "ఓహో అత్తయ్యా ఇప్పుడేనా రావడం. బావా వాళ్లు అందరూ క్షేమమా? ఫ్యాక్టరీ పనులు చాల చురుకుగా జరుగుచున్నట్లు వినుచున్నాను. చాల సంతోషము.

సుందరమ్మ:—కోడలా! నీవు నిజముగ నాకు కోడలవు కాగలభాగ్యము ఎప్పుడు కలుగజేసెదవు? మీ బావను గృహస్థునుజేసి మీ ఇరువురు సమస్త సౌఖ్యము లనుభవించుచు, మీద్వారా భగవంతుడు కొంతమేలును ప్రపంచమునకు కలుగజేయు నేకాంక్షించుచున్నాను. ఇద్దరు విద్యావంతులు. ఇద్దరు దేశకాల పరిస్థితుల నెరిగి మానవ ధర్మమునకు సోపాన ప్రాయములగు నూతన నూతన పద్ధతులను నెలకొల్ప

టకు సమర్థులు, విశ్వజనీన ధర్మమును ప్రస్తుత అవసర ధర్మానుష్ఠానములద్వారా పొందనవకాశమును జూపింపజేర్పరులు; అట్టి మీ రిరువురు దంపతులగుటకునే కాంక్షించుచున్నాను.

కుటుంబః:—అమ్మాయీ! మీ రుభయులు ఒకరి నొకరు ప్రేమించుకొనినది వాస్తవమే గదా? వివాహము చేసుకొనుటకు నీ కేల వింతఅనుమానము.

కమల:—మనసంఘమునందున్న పెద్దలోపమిద్దరే. వివాహములు కానంతమాత్రమున ఏదో గొప్ప లోపము జరిగినట్లు విచారించెదరు. నాకా పద్ధతి నచ్చదు.

సుందరమ్మ:—అయిన నీ వవివాహితగా నుండదలచితి వను మాట! అమ్మా! ప్రాపంచిక వాసనల ననుభవించుచు ప్రాపంచిక రుచులలో కలిసి మెలసి తిరుగుచున్నంత కాలము నిష్కళంక బ్రహ్మచర్య మవలంబించుట దుస్సాధ్యమని పెద్దల అనుభవ ప్రమాణముల వలనమునను, నాగరిక దేశములయందు గాన్పించు లెక్కకు మిక్కిలియగు ఆర్ఫనేజిల మూలమునను మనకు స్పష్టము. నీ రక్తనాళములయందు, భారతీయాంగనల ప్రత్యేక గౌరవస్థానమునకు మూలకందమగు పరమపాతివ్రత్య రక్తము ప్రవహించుచున్నది. అట్టి గౌరవమును కాపాడుట విద్యావతి వగు నీకు విధియని వేరే చెప్పనవసరము.

కమల:—ఏమీ! పురుషునకు సేవజేయుచూ దాస్యభావమును పూనుమనియా నీ కాంక్ష. అది నా మతముగాదు.

సుందరమ్మ:—చిన్నపిల్లవగు నీకు పాతివ్రత్య ధర్మము దాస్యచిహ్నమన్నట్లు స్ఫురించుచుండుట విచారము. పాతివ్రత్యము మోక్షద్వార స్వరూపమగు త్యాగస్వరూపము. సృష్టినియమముల ననుసరించి భరించు వస్తువు యెడల భరింపబడువస్తువు ప్రేమ విశ్వాసత్యాగములను చూపించుట ఆత్మోద్ధారక హేతువుగాదా? ఇట్టి పవిత్రగుణ విరాజితులిందు అంతస్తు పొందుగౌరవము, పొందు పూజ్యత మహాయోగీశ్వరులు గూడ పొంద నవకాశము లేదని మన పెద్దల వచనము. అట్టిదానిని చులకనగ తూలనాడ జనదు.

కమల:—స్వార్థపరులగు కొందరు పురుషమ్మన్యులచే కల్పింపబడిన దీని నిట్లు ఇంతగా వర్ణించుట నాకు అసందర్భముగ దోచుచున్నది.

సుందరమ్మ:—ఓసి వెఱ్ఱిదానా! నీవేమియు మన భారతీయుల సంఘాచారములగూర్చి లోతుగా కించిత్తైన పరిశీలించినట్లు గాన్పించదు. నిజమే తెలియుట కవకాశమెక్కడ? సమస్తవిధముల తన సంతానము యొక్క అభివృద్ధులను పాటించ బాధ్యతగల తండ్రి తన విధిని మీరి తనసౌఖ్యమును చూచుకొనుటలోనే లీనమైనయెడల ఆ సంతానముయొక్క స్థితి ఎట్లుండునో అట్టిస్థితిలో ప్రస్తుతమున్న మన సంఘము ఈ విధముగా గాక మరేవిధముగా యుండగలదు. ఉపనిషద్యుగము మొదలు పురాణయుగమువరకు, చివరకు కొన్ని వందల సంవత్సరముల క్రితమువరకు కూడ స్త్రీలను చూడుము! మనవారు మన స్త్రీలను బానిసలగా నుంచదలచిరో, లేక మాతృదేవతలగాను, అర్ధాంగలక్ష్ములుగను ఎంచి పూజించి, గౌరవించిరో తెలియగలదు. సృష్టియందే స్వభావసిద్ధముగా యున్న స్త్రీ పురుష స్వభావభేదముల ననుసరించి ఆయా విధాయకములకు స్త్రీ పురుషుల నిర్వారను బాధ్యులనుగా జేసినట్లు ప్రపంచమంతయు సాక్ష్యమిచ్చుచున్నది.

నిజముగ స్త్రీజాతినంతయు బానిస స్థితియందు నుంచుటే హైందవులు ఆదర్శముగ నెంచినయెడల వేదములయందు స్త్రీలచే వ్రాయబడిన ఋక్కు లుండుట సంభవమా? దానధర్మములను చేయుటకు పత్నీరహితుని కధికారములేదను శాస్త్రములు స్త్రీల నగౌరవపరచు సూచనలా?

368

కమల:—నీగొప్పలు చాలుగాని ఆ ఆస్తిపాస్తులలో స్త్రీల కొక్కింతయైన భాగములు కల్పించిరా? అది వారి స్వార్థమునకు ప్రబలనిదర్శనముగాదా?

సుందరమ్మ:—ప్రత్యేక ధనావశ్యకములేని కాలములో పాడిపంటలచేతను ధనధాన్య సమృద్ధి చేతను గృహములే సత్రవులుగనుండి స్త్రీలే గృహయజమానురాండ్రుగ నున్న కాలములో స్త్రీకి ప్రత్యేకముగ ఆస్త్యవసరము గానిపించకపోవుటవల్ల ఈలోపము కల్గియుండవచ్చును. కాలానుసరణముగ ధనావశ్యకత ఏర్పడినకాలమున మనస్మృతిని తప్పక పొందవలెను. పొందవచ్చును. కమలా! నీవు బాగా యోచించుము. నామాటను గౌరవింపుము.

కమల:—ఏమిటత్తా! నీధోరణి నాకేమియు తలకెక్కలేదు. వెళ్లి భోజనము చేయుము. క్లబ్బుకి వెళ్లి వచ్చెదను. అని లోనికి వెళ్లిపోయెను. తల్లి, దండ్రి, మేనత్త ముగ్గురు ఒకరిమొగ మొకరుచూచుకొనక మొగములను వ్రేలవైచుకొనిరి.

3

ఒకరోజు మధ్యాహ్నము కుటుంబరావుగారు, ఆయనభార్య రుక్మిణమ్మయు మేడమీద వసారాలో నిల్చుని అప్పుడే యూరేగి వెడలిపోయిన పీర్ల పండుగలనుగూర్చి మాటాడుకొనుచుండిరి. ఇంతలో బారిష్టరు కబురుద్దీనుగారి భార్యయు తనకుమార్తెయు అగు కమలమ్మ విసవిస మేడపైకి వచ్చుచుండుటగాంచి తల్లిదండ్రులు చకితులై ఏమమ్మా! ఒంటరిగ బిడ్డలనైన వెంటపెట్టుకొనక ఇంతదూరము వచ్చితివి? నీవంట్లోగాని, నీభర్తపిల్లల వళ్లల్లోగాని ఏమియు తొందరలు లేవుగదా? అని ప్రశ్నించిరి.

కమలమ్మ:—ఎవ్వరికీ ఏరోగమూ లేదు. అతని చర్య అంతకంతకూ నాకు నచ్చుటలేదు. నేచేయు పనులన్నిటిలోను పానకములో పుల్లవలె ఏదోవిధముగా అడ్డుతగులుచు పరీక్షించుచుండును. అది నా స్వేచ్ఛకు నాఆత్మసాక్షికి భంగము. అందువల్లనే వచ్చివేసితిని.

రుక్మిణమ్మ:—అరెరో! అన్నిట్లో నీకెంత దురహంకారమెందులకే. భార్యాభర్తలైనపుడు ఒకరికొకరికి తెలియగూడని రహస్యము లేమియుండునే!? ఎందుకువచ్చిన వివాహములు యివి? పిల్లలను ఏమిచేసితివి? నీదురహంకారము నీయందున్న మాత్రపు ప్రేమనుగూడ నశింపజేసినట్లే. మొట్టమొదటనుంచి వలదు వలదన్నను పుట్టుపూర్వోత్తరములు, వంశమర్యాదలు ఎరుగనివారితో వివాహసంబంధము పెట్టుకొనుట తప్పు. మంచివారైనంతమాత్రమున గౌరవార్హులేగాని ఇట్టిపద్ధతికూడదని చెప్పితినిగదా? వివాహమన్నప్పుడు కేవలము బొమ్మలాటలా: ఇప్పటిపద్ధతిప్రకారము ఈడువచ్చిన నీవు వరించి చేసుకొంటివి. ఇప్పుడు తిరిగి ఈతప్పేమిటి? అనిపల్కి కంగారు పడుచుండెను.

కుటుంబ:—అమ్మా! ఇప్పుడు నీయుద్దేశమేమి?

కమల:—"ఈ ఉద్దేశమునకేమున్నది వివాహవిచ్ఛేదన మొనర్చుకొనదలచివచ్చితిని" ఆపల్కులువిన్న తల్లిదండ్రులనడుము నటుక్కుమన్నది. కళ్ల నీళ్లు క్రమ్మినవి. తమ ఏకమాత్ర ముద్దుబిడ్డ ఇవ్విధముగ తన జీవితమును ఇంకొకరిజీవితమును బిడ్డలజీవితములను అధోగతికి ముంచుకొనుచు ముంచుచుయున్నదని తెలియుచున్నప్పుడు వారివలన కీర్త్యపకీర్తులు అనుభవించు తల్లిదండ్రుల ఆరాటము వేర తెలుపవలెనా? కుటుంబరావు అచ్చట నిల్వలేక క్రిందకు వెడలిపోయెను. అన్నిటిని భరించుటకు తల్లి భూదేవతంబోలిన మాతృదేవతగాన విచారముతో మందలించుచూ "కమలా! నీవు ముందువెనుక లారయక నీఅంతస్తును, నీవిధాయకమును, నీగౌరవమును, నీవంశగౌరవమును కించిత్తైన తలపక ఇచ్చవచ్చినరీతిని పశుచర్యననుకరింప ప్రయత్నించుచున్నావు. నీవివాహము చిన్నప్పుడు జరిగిన ఒకవేళ సరియైనవరునికి తల్లిదండ్రులనుగు మేము ఈయజాలమైతిమను నిందకు గురియైన గాగలము.

యుక్తవయస్సువచ్చి మంచిచెడుగుల తారతమ్య మెరుగ నేర్పుగలిగి ఒకరికొకరు ఆధీనులైనట్లు ప్రమాణ వాక్యములద్వారా మనోవాక్కాయ కర్మలా పరస్పర విశ్వాసులుగా మెలంగ నియమించుకొన్నప్పుడు ఇట్టి విచ్ఛేదములకు ప్రయత్నించుట అతిఘోరము. ఇక ప్రపంచమున సత్యమునకు వాగ్దత్తమునకు విశ్వాసమునకు స్థానములేనట్లు ఈచర్యలవలనను స్పష్టమగుచున్నది. మాఇచ్ఛకు నీవు వ్యతిరిక్తవుగా మెలగుచుంటివని నీవు మాకుమాత్రవుగావని ఎప్పుడైన తలచుటకు ప్రయత్నింతుమా? నీబాగుకోరకే ఎల్లప్పుడు ప్రయత్నించుచూ నిన్నేవిధముగనైన సత్క్రమమార్గమున త్రిప్పు ప్రయత్నింతుము. ఆవిధముననే నీవును నీకోపమునుమాని నీభర్తను నీభర్తగాదని తెల్పసాహసించక ఆయన యోగక్షేమములే మనమున కోరుచుండుట నీవిధాయకము. కీర్తికరము" ఇట్లు తల్లిపల్కుచుండగా కుటుంబరావు తిరిగి కుమార్తెవద్దకువచ్చి బుజ్జగింపు మాటలతో "తల్లీ! మీఅమ్మ చెప్పినట్లునడచి కీర్తి గాంచుము. లోపాలోపములు మానవులకు సహజములు. అందులో నీవుచెప్పినలోపము బొత్తిగ నగుబాటుపోతువు, గీతలలో "స్త్రీషుదుష్టాసువార్ష్ణేయ జాయతే వర్ణసంకరః" అని చెప్పబడినట్లు సంఘమునకు పునాదులగు స్త్రీలప్రవర్తన కళంకితమైనయెడల వర్ణము అనగా ప్రత్యేకజాతులు గాక మానవజాతియంతయు సంకరమగును. సంఘపవిత్రతకు స్త్రీపురుషులు యిర్వురు సమానబాధ్యులైనప్పటికి పురుషుడు సృష్టికి కేవలము బీజస్వరూపుడేగాని దానిని ధారణచేసి పవిత్రస్థితియందుంచి పెంచి దృఢమైన పునాదుల మీద పోషించి మానవప్రపంచమున కప్పచెప్పవలసిన బాధ్యతంతయు స్త్రీదైయున్నది. నీవును నీపవిత్రతను మాత్రము ఏమియు పల్లించుకొనక కాపాడుకొనుచుండిన నీకును సంఘమునకును కీర్తికరము. మామాటలను మన్నింపుము. ఒడలున రక్తబిగి తగ్గినవెనుక నీవు మిగుల పశ్చాత్తాపపడవలసియుండువు. సద్గుణరాసియు నీక్షేమకాంక్షియు అగు నీభావను నిరాకరించి ఆతనిని నేటివరకును ప్రపంచసౌఖ్య విరహితుడగు విరాగినిగా జేసితివి. చేసికొనిన ఇతనినైన సరిగచూచి సుఖింపుము. అనవసరకోపము నుజ్జగింపుము. కోపము మంచిచెడుగుల గాంచనీయదు. నామాటవిని మమ్ములను అప్రతిష్టపాలుగానీక నీవు ప్రతిష్టను గాంచుము.

కమల:—ఎక్కడున్నను నాకు వ్యతిరేకపరిస్థితులే కలుగుచున్నవి. కానిండుచూతము. రెండురోజులైన అన్నము పెట్టెదరా? లేక హోటలునకు వెళ్లమనెదరా? అని తీక్ష్ణముగాబల్కి తనవెంట తెచ్చుకొన్నపెట్టెను సవరించుకొనుచుండెను.

## ౪

"నాయనా! నీవెన్నిదినములీవిధమున కాలక్షేపము చేయుదువు? ఆకమల ఏలాగు వివాహయోగ్య కాదుగదా. నీవెందులకు వివాహము చేసుకొనకూడదు. ఇప్పటికే అనేకమంది తమ కన్యలనిచ్చెదమని కబురులంపుచున్నారు. ఏమి మాట్లాడవు?" అని సుందరమ్మ కుమారుడగు ఆనందరావుతో బల్కెను. ఆతడును చిరునగవు మొగమున కొంత వన్నెయొసగ "తల్లీ! సకలజ్ఞవగు నీకు నేను తెల్పవలసిన దగ్గియు లేదు. మనస్సు ఎప్పుడైతే ఒకరియందు లగ్నమాయెనో అప్పుడే వివాహమైనట్లుగదా! ఆవివాహము ఆజన్మాంతము ఇరువురను బంధించునుగదా. విధికృతముగ ఎవ్వరైన మరణించిన అప్పుడు వారిష్టమువచ్చినయెడల వేరొకరిని కాదని నింకొకరిని, నింకొకరిని కాదని వేరొకరిని ప్రేమించుట నిందనీయము ఆత్మపతన హేతువగు చాంచల్యమునకు దోహదము కాదా? ఒకరివలన తప్పున్న రెండవవారు ఆతప్పు దిద్దుబాటునకు వచ్చువరకు ఎదురుచూచుచు అనుభవించవలసినదేగాని కాలము వెళ్లిగా ప్రజలందరు పురితేనిదారముకన్న సులభముగా ఈదాంపత్యసూత్రమును త్రెంచిన అధర్మమునకు భంగము కాదా? భగవత్సేవకు ప్రత్యామ్నాయముగు మానవసేవను చేసి ధన్యుడనగుటకును నేనిట్లు వ్యాసనిర్ణైన తెలుసుకొని కొంతకాలమునకైన కమల తనజీవితమును పశ్చాత్తాపాగ్నిలో బడవైచుకొని పవిత్రవంతి మెందర్పుకొనుటకును అవకాశము లేగ్వడుచున్నవి. కాన నీవింక విచారించకుము." అని పల్కె

370

కుమారునివాక్యములకు బదులాడ నేరక, "నాయనా! అటులనే కానిమ్ము. నిన్నీశ్వరుడు దాశీర్వదించును గాక" అని చెప్పుచుండగా, ఒక జవాను పరుగెత్తుకొనివచ్చి "బాబుగారూ! చిన్నబాబుగారు సైకిలు మీదనుండి క్రిందబడి పెద్దగాయము తగులగా నాన్నగారు పెద్దాసుపత్రికి తీసికొని వెళ్లినారు. మీకీసంగతి చెప్పి అమ్మగారితోసహా మిమ్ములను రమ్మని చెప్పుమన్నారు. కారు వీధిలోనున్నది." అని పల్కగానే తల్లి కుమారులిద్దరు ఏమియుతోచక కంగారుతో ఆసుపత్రికివెళ్లి చూచి అక్కడిస్థితి మరేమియూ ప్రమాదావస్థలోలేదని తెలిసి శాంతించిరి. అక్కడికి వచ్చిన డాక్టరుగారితో మన ఆనందరావుకు ఎక్కువ స్నేహముగాన ఆతనితో ఏమేమియో మాటాడుచు ఆస్పత్రియంతయు చుట్టుచుండెను. ఆనందరావుకండ్లకు ఏమిదృశ్యము గాన్పించినదోగాని ఆకస్మాత్తుగ నిల్వబడి "డాక్టర్! ఆమెఎవరు? ఏమిజబ్బు?" అని ప్రశ్నించెను.

డాక్టర్:—ఆమె తన పేరుగాని తనవూరుగాని తెల్పజాలదనియు ఒక దిక్కుమాలిన వనితయనియు మాత్రము చెప్పినది. ఆమె తనచరిత్రను ఎంతమాత్రము బయటకుచెప్ప నిచ్చగించనట్లు తోచుచున్నది. ఆమెకు గుండెజబ్బు, గర్భాశయసంబంధమైన ప్రబలరోగములు కొన్నిగలవు. బహుశా అది కుదిరేజబ్బుగాదు. మనిషినిచూచిన గొప్పకుటుంబములోపుట్టి పతితయైనట్లు తోచుచున్నది." ఆనందరావు ఆమాటలమువిని ఒక దీర్ఘనిశ్వాసమునువిడిచి "ఆమెను నే నెరుగుదును. కొంతసేపు మాటాడివచ్చెదను. నీవు వెడలుము" అనిపల్కి మెల్లగ వణుకుచున్న పదములతో మంచము సమీపమున నిల్వబడి మెల్లగా కమలా! అని పల్కరించెను. ఆమెయు త్రుళ్లిపడి దుఃఖమును పట్టజాలక శరీరస్మరణలేక ఉన్నతావును గమనించక లేచి ఆతని పాదములపైబడి బావా! అపరాధిని పాపిని క్షమించుము. నీవే నాపాలిట పతితపావనుడవు. అని పల్కి వెక్కి వెక్కి ఏడువసాగెను. అతడెంత ధీరుడైనను ఆక్షణమున తనకంటినుండికూడ రెండు కన్నీటికణములను రాల్చకుండ నుండజాలకపోయెను. వెంటనే ఆమెను లేవనెత్తి మంచముపై పరుండజేసి "కమలా! విచారించకుము; జీవులు కర్మానుగతులు. జ్ఞానఖడ్గముచే తన్నెదుర్కొనిన సంకటపథములను సుకరముగ జేసుకొనుట ఉత్తమ పురుషలక్షణము. నీవెప్పుడైతే పశ్చాత్తాపాగ్నిలోబడి సంస్కరింపబడితివో అప్పుడే నీజన్మము అగ్ని తప్తమైన సువర్ణమువలె కళంకరహితమైనది. నీస్థితి ఇంత హైన్యతకు రాగతమేమి? మాకు చాలదినములనుండి నీసంగతులేమియు తెలియుట లేదు. నీరెండవవివాహము వరకుమాత్రమే నాకు తెలిసినది. ఆడాక్టరు శేసెపు ఎక్కడున్నాడు? నీబిడ్డ లెక్కడ?

కమల:—నేనా కథనములను తలచిన నాగుండెలు వ్రక్కలగుచున్నవి. అతడు అకస్మాత్తుగ నాకు తెలియకుండ వేరొక యువతినితీసికొని ఏదోచదువని నెపము పెట్టి ఇంగ్లండు వెళ్లిపోయినాడు. నావద్దనున్న ధనమంతయు వ్యయముకాగా దయామయులగు నాతల్లిదండ్రులమనముల నొప్పించి పాపార్జనను చేయజాలక కష్టపడుచు క్రిస్టియన్సు ధర్మమా అని బిడ్డలను అర్ఫనేజిలో అప్పజెప్పి నాశరీరమున దుర్గతబలముకాగా ఇచ్చటికి వచ్చిచేరితిని. ఇక నేను భూమిమీద బ్రతుకజాలను. నారోగముకూడ నాకనుగుణ్యముగానేయున్నది. అంత్యకాలమున నీదివ్యదర్శనముచేసి నిన్ను క్షమింపవేడుకొని నిశ్చింతగ ప్రాణము వదలవలకాశము కల్పించునాశతో ఈయూరికి వచ్చితిని. భగవంతుడు అన్నివిధముల నన్ను దయతోనను నిమేషము చూచుచున్నాడనుటకు ఈనీదర్శనమే నిదర్శనము. నాసహవాసదోషములు నానవనాగరికతాదర్పములకు దోహదమొసగ్గ మీఉద్బోధనలు మీనీతివాక్యములు బూడిదలోబోసిన పన్నీటివలె నిరర్థకమై నాజీవితము అధోగతికివచ్చినది. కడసారి నీద్వారా భగవంతుడు తన దివ్యదర్శనమును నాకు గాన్పింపజేసి నాజన్మమును ధన్యముజేసినాడు. ఆనందం! నీవు నాపాలిట ఆనందధాముడవై, ఆనందజ్యోతివై బ్రహ్మానంద సంధాయకుడవగుచున్నావు. నీవు క్షమించితి ననకున్న ఈప్రాణిబోదు. నీజీవితమును సుఖవిదూరము చేసిన పరమపాతకిని. అయినను నీవు ధన్యుడవు. నా అంత్యకాలమున నిన్నుగాంచిన నేను ధన్యను, నీయట్టి ఉన్నతాత్ముని గాంచిన నీజననీజనకులు ధన్యులు. నీదేశము ధన్యము" అని పల్కుచుండగానే ఈ ఆవేశముచేత ఆకస్మాత్తుగ గడియారమాగినట్లు ఊపిరాగిపోయెను. ఆనందరావు నిశ్చేష్టుడై మ్రాన్పడి కొంతవడి నట్టె నిల్వబడిపోయెను.